ఎనాళ్లీ ఇక్కట్లు!



కొత్తపాలెం వెళ్లే రోడ్డులో వాహనాల పార్కింగ్ ఇలా



ఫుట్‌పాత్ దాటి రోడ్డుపైకి పేర్చిన సామగ్రి

- సింహాచలం రైల్వే స్టేషన్ రోడ్డులో ఆక్రమణలు
- కుచించుకు పోతున్న రహదారి
- నిత్యం ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్‌పీఎఫ్, ట్రాఫిక్ పోలీసులు

గోపాలపట్నం: గోపాలపట్నంలో సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద ట్రాఫిక్ సమస్య తలనొప్పిగా మారింది. రోడ్లు ఆక్రమించి దుకాణాలు నిర్వహించడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. ఇక ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రైన్లు దిగి వచ్చేవారి రద్దీతో సహ ఆటోలు ఇతర వాహనాలతో గజిబిజిగా తయారవుతోంది. ఇలాంటి పీక్ సమయాల్లో కూడా ట్రాఫిక్, రైల్వే పోలీసులు పట్టించుకోకపోవడంతో అవస్థలు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు.

ఆక్రమణల బెడద

బీఆర్‌టీఎస్ రహదారి నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారి ఆశాంతం ఆక్రమణలకు గురయింది. దుకాణదారులు ఫుట్‌పాత్ దాటి రోడ్డుపైకి సామగ్రి పేర్చి ఇబ్బందిగా తయారవుతున్నారు. దీంతో పాటు రైళ్లు వచ్చే సమయంలో ఆటోలు అడ్డంగా పెట్టడంతో నడిచి వెళ్లేందుకు కూడా ఇబ్బంది పడుతున్నారు. రైలు వచ్చిందన్న కంగారులో అడ్డంకుల్ని తప్పించుకుని వెళ్లే సరికి రైలు తప్పిపోతోందని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు.

పట్టించుకోని పోలీసులు

ఇక్కడి సమస్యపై అటు ట్రాఫిక్ పోలీసులు ఇటు ఆర్‌పీఎఫ్ పోలీసులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. రద్దీ సమయాల్లో పర్యవేక్షించినా కొంత మేరకు ఇబ్బందులు తొలగుతాని చెబుతున్నారు. రైలు దిగి వచ్చేవారికంటే రైలు ఎక్కేందుకు వెళ్లేవారు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టికెట్ తీసుకుని ప్లాట్‌ఫారానికి వెళ్లే సరికి రైలు కదిలిపోతోందని వాపోతున్నారు.

ఇలా చేస్తే మేలు

స్టేషన్ అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో ఆక్రమణలు తొలగించి రహదారిని సైతం అభివృద్ధి చేయాలి. అనధికార పార్కింగ్‌కు చెక్ పెట్టాలి. ఫుట్‌పాత్, రోడ్లపై దుకాణదారులు రాకుండా చర్యలు తీసుకోవాలి.

ట్రాఫిక్ జామ్

రైల్వే స్టేషన్ రోడ్డులో ట్రాఫిక్ జామ్ నిత్యం కృత్యంగా మారుతోంది. స్టేషన్ ప్రహరీకి ఆనుకుని ఉన్న రహదారిపై వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. గతంలో ట్రాఫిక్ పోలీసులు వాహనాలు పార్కింగ్ చేయకుండా నిరోధించారు. అప్పటి ఎస్‌ఐ శ్రీనివాసరావు బదిలీ అయిన తర్వాత దీన్ని అటకెక్కించారు. దీంతో రోజూ ట్రాఫిక్ జామ్ సర్వసాధారణమైపోయింది.



సింహాచలం రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారిలో దుకాణాలు



రాత్రి సమయంలో వాహనాల రద్దీ

వాకర్స్ పార్క్‌లో వసతులు కల్పిస్తాం



వాకర్స్‌పార్కులో సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 జెడ్సీ రాము

సాక్షి ఎఫెక్ట్..

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీలోని వాకర్స్ పార్కులో వసతులు కల్పిస్తామని జోన్–5 జెడ్సీ బి.రాము చెప్పారు. పార్కులో నెలకొన్న సమస్యలపై 'సాక్షి' దినపత్రికలో గురువారం వాకర్స్ పార్కులో సమస్యల నడక అన్న శీర్షికతో ప్రచురించిన కథనానికి జెడ్సీ స్పందించారు. ఈ మేరకు శుక్రవారం జెడ్సీ రాము జీవీఎంసీ పలు విభాగాల ఉన్నతాధికారులతో కలిసి పార్కును పరిశీలించారు. వాకర్స్‌తో కాసేపు మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్కులో సిమెంట్ బల్లలు విరిగిపడటం,ఆకతాయిలు రాత్రి వేళ పార్కులో మద్యం సేవించి పరిసరాలను పాడుచేస్తున్నారని వివరించారు. జెడ్సీ స్పందిస్తూ పార్కులో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఆకతాయిలు రాకుండా పోలీసులు గస్తీ పెట్టేలా అధికారులతో మాట్లాడుతానని వాకర్స్‌కు భరోసా ఇచ్చారు.

అప్పన్న కల్యాణం, చందనోత్సవానికి ఆహ్వానం

సింహాచలం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి కల్యాణం, చందనోత్సవానికి హాజరు కావాలని ఎమ్మెల్యే గణబాబుకు శుక్రవారం సింహాచలం దేవస్థానం అధికారులు ఆహ్వాన పత్రిక అందించారు. గోపాలపట్నంలోని ఆయన ఇంటి వద్ద ఏఈవో ఆనంద్ కుమార్ కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

క్లుప్తంగా

12న హనుమాన్ శోభాయాత్ర



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

మల్కాపురం: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 12న హనుమాన్ శోభాయాత్ర పేరిట బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం జింక్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద బీజేపీ నాయకుడు పాలిమేర శ్రీను, లక్కరాజు రామకృష్ణ,వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రామ్మోహన్‌నాయుడు విడుదల చేశారు.12న జింక్ ఆంజనేయస్వామి ఆలయం నుంచి మల్కాపురం వరకు హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు.హిందువులంతా కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు ట్రోఫీ అందజేత



విద్యార్థులకు ట్రోఫీ అందిస్తున్న గణబాబు

గోపాలపట్నం: గోపాలపట్నం దరి ఇందిరానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ప్రభుత్వ విప్ గణబాబు సందర్శించారు. నాడు–నేడు రెండో ఫేజ్‌లో మంజూరైన టీవీలను, భోజన శాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు ఏవిధమైన సౌకర్యాలు అవసరమైనా తీరుస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలకు భోజన ప్లేట్లు, మంచినీటి సీసాలు అందించారు. అనంతరం ఇటీవల నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన ఇందిరానగర్ పాఠశాల విద్యార్థులతో పాటు లక్ష్మీనగర్ ఈ బ్లాక్ పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందించారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

విశాఖ ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్లకు సత్కారం



పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్లను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: విశాఖ ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్లు విజయకుమార్ ప్రసాద్, పవన్ కుమార్ జాస్తిలను శుక్రవారం ఈపీఎస్ 95 పెన్షన్ వారియర్స్, ఉక్కు అధికారుల సంఘం(సీ) నాయకులు సత్కరించారు. విజయకుమార్ ప్రసాద్ భువనేశ్వర్‌కు, పవన్ కుమార్ జాస్తి బెంగళూరు బదిలీపై వెళ్తున్న సందర్భంగా నాయకులు ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయంలో కలిసి శాలువాలు కప్పి, పూల మొక్కలు అందజేశారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు పూర్తి వేతనంపై ఈపీఎస్ 95 పెన్షన్ మంజూరు తదితర సమస్యల పరిష్కారానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సీ నాయకులు కాటం చంద్రరావు, కె.వి.డి. ప్రసాద్, టి.శ్రీనివాసరావు, పదవీ విరమణ అధికారులు దుద్దు శ్రీనివాస్, జె.ఎ.స్వామి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాలకు అండగా సీపీఐ పోరాటాం



కార్యకర్తలకు హుండీలు అందిస్తున్న సత్యాంజనేయ, రాంబాబు

సింథియా: పేదలు, బగుడు, బలహీన వర్గాలకు అండగా సీపీఐ పోరాటాలు చేసుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కాండ్రేగుల సత్యాంజనేయ, గుడాల రాంబాబు అన్నారు. ఆ పార్టీ కాకరలోవ శాఖ మహాసభను శుక్రవారం సీశాఖ కార్యదర్శి ఎన్.వి.త్రినాథ్ ఇంటి వద్ద ఎస్. లక్ష్మి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూరైన సందర్భంగా ఈ నెల 11న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బహిరంగసభ నిర్వహిస్తున్నామని తెలిపారు. దీన్ని విజయవంతం చేయడానికి హుండీల ద్వారా విరాళాలు సేకరించాలని సూచించారు. వార్షికోత్సవ వేడుకలకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి , కేంద్ర కార్యదర్శి కె.నారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు



అభిషేకంలో పాల్గొన్న డాక్టర్ శ్రీనివాస్ దంపతులు, ఆలయ కమిటీ పెద్దలు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలే అవుట్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో ఈ నెల 6న సీతారాముల కల్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో పందిరిరాట వేశారు. ముందుగా సీతారామ లక్ష్మణ సమేత ఉత్సవ మూర్తులను ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చి శాస్త్రోక్తంగా అభిషేకం జరిపించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ పందిరిరాట వేయించారు. కాలనీకి చెందిన డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శిరీష దంపతులచే ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేకం జరిపించారు.శ్రీరామనవమి రోజు నిర్వహించే కల్యాణోత్సవాన్ని కాలనీవాసులు తిలకించి తరించాలని కోరారు.

పరిశ్రమలకు 'స్కిల్' అవసరం



మాట్లాడుతున్న జోన్-1 ఆర్డీడీ రమణ

పెదగంట్యాడ: ఐటీఐలోని ఫిట్టర్, టర్నర్ ట్రేడ్ విద్యార్థులకు పరిశ్రమలకు అవసరమయ్యే విధంగా శిక్షణ ఇవ్వాలని జోన్–1 ఆర్‌డీడీ ఆర్‌వి రమణ అన్నారు. ప్రభుత్వ ఐటీఐలో ఫిట్టర్, టర్నర్ ట్రేడుల కరిక్యులమ్ మార్పు కోసం కోల్‌కతాకు చెందిన సీఎస్‌టీఏఆర్‌ఐ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలకు కొత్త స్కిల్ అవసరం ఉందన్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి విద్యార్థుల్లోని ప్రతిభ మరింత వెలికితీయాలని సూచించారు. పెరుగుతున్న ఉపాధి అవకాశాల దృష్ట్యా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తర్ఫీదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్, షిప్‌యార్డ్, డాక్‌యార్డ్, రైల్వే, గంగవరం పోర్టు,కు చెందిన పలువురు పాల్గొని పలు సూచనలు చేశారు. ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెకు ఐఎన్‌టీయూసీ మద్దతు



మద్దతు తెలియజేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు ఈ నెల 16న తలపెట్టిన సమ్మెకు ఐఎన్‌టీయూసీ మద్దతు ప్రకటించింది. ఐఎన్‌టీయూసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం కార్యనిర్వాహక సంఘం అధ్యక్షుడు కె. వంశీకృష్ణ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో స్టీల్ ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపును తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికే తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెకు తాము పూర్తి మద్దతు ఇస్తున్నామని వెల్లడించారు. కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం వంటి చర్యలను యాజమాన్యం మానుకోవాలన్నారు. రమణమూర్తి, ప్రభాకరరెడ్డి, వెంకన్న, బి.అప్పారావు, కె.అప్పారావు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌తో తక్షణ ఉపాధి



విద్యార్థులతో మాట్లాడుతున్న గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ

మురళీనగర్: టెన్త్ అనంతరం పాలిటెక్నిక్ విద్య అభ్యసించడం ద్వారా తక్షణ ఉపాధి అవకాశాలు పొందవచ్చని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు ఇనిస్టిట్యూట్ (గైస్)లో పదో తరగతి విద్యార్థులకు పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులు శుక్రవారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు మంచి డిమాండు ఉందని పేర్కొన్నారు. పాలిసెట్‌కు ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాలిసెట్‌లో మంచి ర్యాంకు రావాలంటే పాఠ్య పుస్తకాలపై ఆధారపడాలన్నారు. మెటీరియల్ కేవలం ఒక మార్గదర్శిగానే ఉపయోగపడుతుందన్నారు. పదో తరగతి పాఠ్య పుస్తకాలతో పాటు, పాత పరీక్ష పేపర్లు ప్రాక్టీసు చేయాలన్నారు. పాలిటెక్నిక్ కోర్సును మూడేళ్లు అభ్యసించాల్సి ఉంటుందన్నారు. కెమికల్ ఇంజినీరింగు, మెటలర్జీ కోర్సులు మూడున్నర సంవత్సరాలు చదవాల్సి ఉంటుందన్నారు. వీరు కోర్సు మధ్యలో ఏడాది పాటు ఇండస్ట్రియల్ ట్రైనింగ్ పొందుతారని, ఇతర విభాగాల కోర్సుల్లో ఆరు నెలలు ఇండస్ట్రియల్ ట్రైనింగు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం రూపొందించిన స్టడీ మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో పలువులు అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో గోతుల పూడ్చివేత



గోతులను కప్పుతున్న శ్మశానవాటిక సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మల్కాపురం: శ్మశానవాటికలో మృతదేహాలను పందులు పీక్కుతినడంపై సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించారు. అధికారులు శ్మశానవాటిక వద్దకు వెళ్లి పందుల సంచారంపై ఆరా తీశారు.రబ్బర్ బుల్లెట్‌ల సాయంతో శ్మశానంలో సంచరిస్తున్న పందులను ఏరివేశారు. సిబ్బంది సాయంతో మృతదేహాలను పూడ్చి గోతులను మరింత భద్రత చర్యలు చేపట్టారు.మృతదేహాలను పూడ్చేవారు గోతులు లోతుగా తీయాలని సూచించారు. ఇకపై పందులు వెళ్లకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

డీసీసీబీలో కారుణ్య నియామకం



అజిత్‌కుమార్‌కు నియామకపు ఉత్తర్వులు అందజేస్తున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో కారుణ్య నియామకం జరిపారు. ఎంబీసీహెచ్‌ఎస్ అజిత్ కుమార్‌కు శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్, బ్యాంకు పర్సన్–ఇన్‌చార్జి మయూర్ అశోక్ డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి డీవీఎస్ వర్మ సమక్షంలో నియామక ఉత్తర్వులు అందజేశారు. డీసీసీబీ మధురవాడ బ్రాంచ్‌లో మెసెంజర్‌గా పని చేస్తున్న మాదు రాంబాబు అకాల మరణం పొందారు. అతని కుమారుడు ఎంబీసీహెచ్‌ఎస్ అజిత్‌కుమార్‌కు విద్యార్హతలు పరిగణనలోకి తీసుకుని నిబంధనలకు లోబడి ఉద్యోగం ఇవ్వాలని గత నెల 26న జరిగిన బ్యాంకు మహాజన సభలో తీర్మానించారు. ఇప్పుడు బ్యాంకులో 5వ కేటగిరీ ఉద్యోగిగా కారుణ్య నియామక ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు జనరల్ మేనేజర్ డి.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.


శ్రీసూర్యారాధన పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య రాజు

సీతంపేట: విశాఖ సాహితీ 54వ వ్యవస్థాపక దినోత్సవం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం జరిగింది. ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త కోలవెన్ను పాండురంగ విఠల్ మూర్తి రచించిన శ్రీ సూర్యారాధన , దేవాలయాలు అనే పుస్తకాన్ని సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి ఆరోగ్య సమతుల్యానికి సూర్య భగవానుడు ఎంతో మేలు చేస్తుంటాడని, అటువంటి సూర్య భగవానుడికి సంబంధించిన విషయాలను పాండురంగ విఠల్ చాలా పరిశోధన చేసి ఒక మంచి పుస్తకాన్ని రచించారని కొనియాడారు. ఒక సాహితీ సంస్థ 54వ వ్యవస్థాపక దినోత్సవం చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని, ఇన్నేళ్లు మనుడగ సాగించడం చాలా గొప్ప విషయమన్నారు. ఘండికోట విశ్వనాథం పుస్తక సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి వై.వి.అనూరాధ, విశ్రాంత పోలీస్ అధికారి శ్రీరంగం దివాకర్, విశాఖ సాహితీ అధ్యక్షురాలు కోలవెన్ను మలయవాసిని, కార్యదర్శి శంకర్ నీలు, ఉపాధ్యక్షుడు డి.వి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

కుళాయిల్లో కలుషిత నీరు



కుళాయి నుంచి వచ్చిన కలుషిత నీరు

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి జయేంద్ర కాలనీలో జీవీఎంసీ కుళాయిల నుంచి మురుగు నీరు, కలుషిత నీరు సరఫరా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలరోజుల నుంచి ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. బురదతో పాటు తోక పురుగులు, చిన్న చిన్న ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తున్నాయని వాపోతున్నారు. దీంతో కుళాయి నీరు తాగాలంటే భయమేస్తోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కుళాయినీరు రంగు, రుచి, వాసన పూర్తిగా మారిపోయి వస్తుందని, ఆ నీటిని తాగితే ఏమైనా రోగాలు వస్తాయేమోనని ఆందోళన చెందుతున్నారు. ఫిర్యాదు చేసినా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

ఉత్తమ లక్ష్యాలతో ఉన్నత శిఖరాలు



మోటివేషనల్ స్పీకర్ వేణుగోపాల్‌ను సత్కరిస్తున్న ఆచార్యులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ గణిత శాస్త్ర విభాగంలోని సీనియర్ విద్యార్థులకు ఫేర్‌వెల్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మోటివేషనల్ స్పీకర్ లక్ష్మీపురం వేణుగోపాల్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఏ రకంగా లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవాలో ఉదాహరణలతో వివరించారు. మీ జీవితం.. మీ చేతుల్లోనూ ఉందని, దానిని అందంగా మలుచుకునే శిల్పి మీరేనని విద్యార్థులకు సూచించారు. ముఖ్య అతిథి కాలేజీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.వి.ఆర్.రాజు మాట్లాడుతూ జీవితంలో ఉపయోగపడే పాజిటివ్ యాటిట్యూడ్, నిబద్ధత, సమయపాలన అలవాటు చేసుకోవాలన్నారు. గణిత శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ అనురాధ కామేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులతో తన అనుభవాలను పంచుకున్నారు. సభ అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రొఫెసర్ పి.డి.ఎస్.శ్రీనివాస్, ప్రొఫెసర్ జి.నానాజీరావు, ప్రొఫెసర్ ఎస్.రవి కుమార్, ప్రొఫెసర్ సిహెచ్.శ్రీనివాసరావు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

డాబాగార్డెన్స్: బాబా సాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, ప్రజా నాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని వారం రోజుల పాటు రాజ్యాంగ పరిరక్షణా వారోత్సవాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సీపీఎం కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 5న బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి రోజు నుంచి వారం రోజుల పాటు కళా ప్రదర్శనలు, పాటలు, నృత్యాలు, కోలాటం, తీన్మార్ డప్పులు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. 13 ఉదయం 9 గంటలకు డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం నుంచి అల్లూరి విజ్ఞాన కేంద్రం వరకు డప్పు కళాకారులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నామని తెలిపారు. సినీ నటుడు, నిర్మాత, పీపుల్స్ స్టార్ ఆర్. నారాయణమూర్తి పాల్గొంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వై. రాజు, నగర అధ్యక్షుడు టి. చిరంజీవి, ఎంపీ ప్రసాదరావు, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు జి. రమణ, ఎస్ఎస్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. అమ్మవారి తిరువీధి ఉత్సవం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వేంజేసిన సింహవల్లీ తాయారు అమ్మవారికి శుక్రవారం విశేషంగా తిరువీధి జరిగింది. సింహవల్లీ తాయారు, చతుర్భుజ తాయారు అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి, ఆలయ బేడా మండపంలో వైభవంగా తిరువీధి నిర్వహించారు. హారతి అందజేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.